

# మాతృత్వం

"నువ్వసలు కన్నతల్లివేనా ?" ఆయన మాటలు చెవుల్లో పదేపదే మార్మ్రోగుతుంటే అసలేపనీ చేయబుద్ధికాలేదు. నేనిష్టంగా చేసుకున్న మాగీ నూడిల్స్ టిఫిన్ కూడారుచి చచ్చిపోయి సయించలేదు. ఓ నిట్టూర్పుకి దాన్నంకితం చేసి యాంత్రికంగా తయారై ఆఫీసుకు బయలుదేరాను.

ఈ ఉద్యోగమే లేకపోతే ఎంత హాయిగా ఆయనగారికన్నీ సమకూర్చి పిల్లలను అపురూపంగా చూసుకుంటూ రోజు రెండు సినిమాలు, పన్నెండు సీరియల్స్‌తో ఇంటిపట్టున ఎంచక్కా కాలక్షేపం చేసేదాన్నో ! ఛ...శాపగ్రస్తమైన జీవితం. ఏం చేస్తాం ? 'ఒక్కోసారి చదువు కూడా కీడు చేస్తుందే తల్లీ !' అనే నాయనమ్మ మాట తన విషయంలో ఇలా నిజమవుతుందనుకోలేదు.

ఏ ప్రయత్నమూ లేకుండా వచ్చిన ఉద్యోగం. 'లక్ష్మి ఇంట్లోకొస్తే మోకాలడ్డు కుంటారా ? మరి నన్నేం చూసి కట్టుకున్నాడో, నా సంపాదన ప్రలోభంలో పడి ముడేశాడో శివానంద. పెళ్ళయి పదేళ్ళవుతున్నా ఆయనగారి నాడి తెలియలేదు మనకి. ఎప్పుడూ లింగం మింగిన జంగంలాగ ఉంటాడు అసలు మాటలే తెలీనట్టు. కానీ ఒక్కసారి నోరు కదలించాడా స్టీరియోఫోనిక్ సౌండ్‌లో నాన్‌స్టాప్‌గా అరుస్తాడు.

పొద్దున కూడా ఎన్నెన్ని మాటలన్నాడు, చిన్నదాన్ని ఒక్క దెబ్బ వేశానని. ఛ ...

భార్యనని కూడా చూడకుండా అంతెత్తునెగుర్తాడా ? ఇంకా నయం ఉద్యోగం చేస్తున్నాకాబట్టి మాటల్తో సరిపెట్టాడు. అయినా నా పిల్లల్ని నేను కొట్టుకుంటే తప్పా ? నేను కొట్టానన్న అక్కసే తప్ప వాళ్ళేం చేసారో ఎవరూ ఆలోచించరు. ఈయనగారి పుణ్యమా అని నా పిల్లలకి నేనే శత్రువునైపోయాను. వేలెడులేరు పిల్ల రాక్షసులు. ఎన్నెన్ని చిక్కులు తెచ్చిపెట్టారు. మొన్నటికి మొన్న పద్మ ఇంటికొస్తే-

"తొందరగా ఎల్లిపొండి అంటీ. అమ్మ చూస్తే కాళ్ళు విరగ్గొట్టేస్తుంది" అంటూ గుమ్మంలోనే వీడ్కోలు పలికింది పెద్దమ్మాయి.

బాత్రూంలో స్నానం చేస్తున్న నాకు ఆ మాటలు వినిపిస్తున్నా ఎవర్తో అంటోందో అది కనిపించకపోవడంవల్ల జరగాల్సిన ఘోరం జరుగుతూపోయింది. ధృతరాష్ట్రుడి సభలో గాంధారిలా వింటూండిపోయాన్నేను. ఏమీ అనలేక.

ఆ పద్మ మరీ గడుసుది, గుసగుసగా అడిగినట్టుంది "ఎందుకూ ?"

"ఎందుకేంటాంటీ ? నువ్వు మా అమ్మ గురించి అటెండర్ ఎల్లేశంతో ఏమేమో చెప్పావటగదా !"

అప్పుడుగానీ నా మట్టిబుర్రకర్థం కాలేదు అది మా కొలీగ్ పద్మతో మాట్లాడ్తోందన్న సంగతి. నేను ఆదరాబాదరాగా చీర చుట్టుకుని బాత్రూంలో నుండి బయటకొస్తూ కేకేశా "సౌజీ....ఓసారిలోపలకు రా !"

నన్ను పట్టించుకోకుండా అది చెప్పదలచుకున్నది చెప్పేసింది. "ఎదురు గానేమోపల్లికిలిస్తూ మాట్లాడుతుంది. ఎనక గోతులు తీస్తుంది. ఈసారది ఇంటికైతే రానీ. కాళ్లిరగ్గొట్టేస్తానంది ఆంటీ పక్కింటి మీనాక్షి ఆంటీతో. మీగురించే ప్రామిస్."

నేను హాల్లోకొచ్చేసరికే తుర్రున పరిగెత్తింది.

నల్లబడిపోయిన మొహంతో కాల్చుకు తినేలా చూస్తున్న పద్మను చూసేసరికి ఏం మాట్లాడాలో తోచలేదు నాకు.

"ఆ....న....మ.....రీ" అంటూ నేను అక్షరాలు వెతుక్కుంటున్నంతలో...

"షటప్. ఎవరిది కుళ్ళో తెలుస్తూనే ఉంది." అంటూ గిరుక్కున తిరిగి వెనక్కి చూడకుండా వెళ్లిపోయింది. అలా వెళ్తూంటే నా జవసత్వాలన్నీ తీసుకుపోయిన ఫీలింగ్ కలిగింది నాకు. కూలబడిపోయాను. ఆ తరువాత నెమ్మదిగా ఆలోచించాను.

ఆ.....పోతే పోయిందిలే. ఉత్త అనుమానప్పోగు. ఎవరు నవ్వినా తన గొప్పతనాన్ని ఓర్వలేక పోతున్నారని ఆడిపోసుకుంటుంది. ఎవరు గుసగుసలాడినా తన గురించే ఆడిపోసుకుంటున్నారని అంగలారుస్తుంది. అది మాత్రం అందరి గురించీ అవాకులూ

చెవాకులూ పేల్తుంది. ఏమైనా అంటే ఊరూ వాడా ఏకం చేస్తుంది. దాని నోటికి భయపడే దానితో సఖ్యంగా ఉండాలని ఆలోచిస్తారు. అది మాత్రం ఎవ్వరితోనూ స్నేహంగా వుండదు. ఎవ్వరూ తనతో స్నేహంగా లేకున్నా ఊరుకోదు. అదో పెక్యూలియర్ కారెక్టర్.

అంతకు ముందురోజు ఏదో అనుమానమొచ్చి ముక్కు చీదేసింది. అది సరిదిద్దేందుకు అప్యాయంగా ఇంటికి పిలిస్తే దాని అనుమానానికి తోడు ఈ పెద్దది ఇలా....

బాధంతా కలసి కోపంగా మారింది. భూతద్దంలో సూర్యరశ్మి ఏకమైనట్టు, ఆ క్షణంలో అది కనిపిస్తే కాల్చేసేదాన్నే, కానీ కనిపిస్తేగా !

చివరికి స్కూల్ టైమవుతుంటే ఊడిపడ్డది వాళ్ళ నాన్నని వెంటబెట్టుకుని. నీళ్ళలో దిగేవాడు ఆక్సిజన్ సిలిండర్ పెట్టుకున్నట్టు.

నేను తెలివితక్కువదాన్నా ? మెల్లగా దొరకబుచ్చుకుని అసలు కారణాన్ని మరుగున పెట్టి "ఎక్కడికి వెళ్లావే. స్కూల్ టైమవుతుంటే బలాదూర్‌గా తిరుగుతావా?" నాలుగు దెబ్బలు నడ్డిమీదా, రెండు చెంపలమీదా లాగించాను.

ఆయనడ్డుకోబోయాడు.

"టైమయ్యేంతవరకూ టైంపాస్ చేస్తారు, టైం కాగానే కబడ్డీ ఆట్టం మొదలుపెడ్తారు" అంటూ ఆయనవైపు సంధించాను. క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్ షాట్స్ కొడుతూనే మంచి బంతి పడ్డప్పుడు డిఫెన్సు ఆడినట్టు.

ఆయనప్పుడేం మాట్లాళ్ళేదు. తర్వాత విషయమంతా తెలుసుకుని దిమ్మదిరిగేలా ఓ క్లాసు పీకాడు. 'నిజం చెప్పినప్పుడు పిల్లలను శిక్షించవద్దట. లౌక్యాలు, లోగుట్టులూ పిల్లల దగ్గర మాట్లాడకూడదట. ఏమిటో ఈయన సోది.'

ఏం చేయనూ ? ఒంటరిగా వున్నప్పుడు పెద్ద ఉపన్యాసమిచ్చి ఆయన నోరు మూయాలనిపిస్తుంది. కానీ తీరా ఎదరుపడేసరికి ఒక్కమాటా బయటకి రాదు. కంగారులో, బాధలో అయితే ఒకటనుకుని ఒకటి మాట్లాడేస్తాను. టెలిఫోన్‌లో రాంగ్‌నెంబర్‌లాగా.

ఆ తర్వాత దానికి స్నానం చేయిస్తుంటే వీపు మీద వేలిముద్రలు ఎగరేసినా ఎర్రజండాలా నన్నెక్కిరిస్తుంటే గుండె గొంతులోకొచ్చింది. కానీ ఏడిస్తే లోకువైపోతానని మొహంమ్మీద నీళ్ళు చిలకరించుకున్నాను.

ఈ రోజునుండీ పిల్లల్నేమీ అనకూడదని నిర్ణయించుకున్నాను. అయినా ఇదంతా ఆయనిచ్చిన అలుసే. ఎంత అల్లరి చేసినా వాళ్ళనెనకేసుకొస్తారు. వాళ్ళముందే 'వాళ్ళు కాకపోతే నువ్వల్లరి చేస్తావా ?' అంటూ వకాల్తా పుచ్చుకుని మాట్లాడితే వాళ్ళు చెప్పినట్టు వింటారా ? ఏమిటో ఆయన చెప్పేదీ రైటే అనిపిస్తుంది.

ఈ రోజు మా యూడీసి రోజా బర్త్‌డే అట. కాజూ బర్ఫీ తెచ్చిచ్చింది. తినబోతుంటే చిన్నమ్మాయి శీతల్ గుర్తుకొచ్చింది. దానికి బర్ఫీ అంటే చాలా ఇష్టం. అలాగే పర్సులో దాన్నిపెట్టేసాను. పెద్దదానికి కూడా సారీ చెప్పేసి ఇద్దర్నీ ఐస్‌క్రీం పార్లర్‌కి తీసుకెళ్లాలి సాయంత్రం.

❋ ❋ ❋

ఇంట్లో కాలు పెట్టేసరికి ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతోంది శీతల్. హడావుడిలో ఫోన్‌కి నంబర్ లాక్ చేయడం మరచిపోయిన సంగతి అప్పుడుగ్గాని గుర్తుకురాలేదు.

దాన్ని చూసేసరికి ఈనెల టెలిఫోన్ బిల్లుమీద నాలుగంకెల సంఖ్య కళ్ళముందు నాట్యం చేసింది.

"ఎవర్తోనే మాట్లాడ్తా ?" హఠాత్తుగా నా సౌండ్ విన్న దాని మొహం కళావిహీనమైంది. ఠక్కున్న రిసీవర్ పెట్టేసింది. బల్లి నోట్లో చిక్కిన పురుగులా వణికిపోతోంది.

"ఎవర్తోనే మాట్లాడ్తా?" ఈసారి రెట్టిపయింది. ఆయన్ని కట్టుకున్న పుణ్యఫుడియా విశేషమేమిటో దేన్నయినా సహించగల్గుతున్నాగానీ మౌనాన్ని సహించలేక పోవడం నా బలహీనతై కూర్చుంది. నా ఖర్మకొద్దీ పిల్లలకన్నీ ఆయన లక్షణాలే. అందరూ ప్రతిపక్షమే నాకు.

"అ......నువ్వయితే అమ్మమ్మతో గంటసేపు మాట్లాడతావు. మమ్మల్నొక్క నిముషమైనా మాట్లా....."

మాట పూర్తి కాకముందే చెంప ఛెళ్‌మనిపించాను.

"ఎంత ధైర్యం ? నన్నే ఎదిరించి మాట్లాడ్తావుటే." మరో నాలుగు దెబ్బలేస్తేగాని కోపం చల్లారలేదు.

❋ ❋ ❋

పడుకోబోయే ముందు మాత్రలకోసం పర్సుతెరిస్తే కనిపించింది. ఆఫీసులో రోజా ఇచ్చిన్న బర్ఫీ.

'ఛ....తనేమనుకుని వచ్చింది ? ఏం చేసింది ? ఎందుకో ఈ మధ్య అన్నీ ఇలానే జరుగుతున్నాయి. గుండె బరువెక్కింది.

గబగబా బెడ్రూంలోకి వెళ్లాను స్వీట్ పట్టుకుని. పిల్లలిద్దరూ పడుకుని వున్నారు. పెద్దామ్మాయి గువ్వలా ముడుచుకుని పక్కకి తిరిగి పడుకుంది. దానికి దుప్పటి కప్పి చిన్నదానివైపు తిరిగాను. హోంవర్క్ చేస్తూ చేస్తూ అలాగే నిద్రపోయినట్టుంది. చేతిలో

పెన్సిల్ చెట్టుకొమ్మల్లోనుండి జారిపడ్తూ ఆగిపోయిన మునక్కాయలా ఓ ప్రక్కకు వొరిగిపోయి వుంది.

మరో చేయి 'మా తెలుగుతల్లి' బొమ్మ కాళ్ళ దగ్గర ఏదోఅర్థిస్తునట్లుగావుంది.

తెరచిపెట్టిన నోటు పుస్తకంలో యుద్ధరంగంలో అలసి పోయి పడిపోయి నట్లు దాని తల వాలిపోయి వుంది. ప్రపంచంలోని అమాయకత్వమంతా దాని ముఖంలోనే గూడుకట్టుకున్నట్టుంది.

"అమ్మా ! కొట్టొద్దమ్మా. సారీ అమ్మా. ఇంకెప్పుడూ చేయనే ?" గంట క్రితం కన్నీళ్లతో బతిమాలుతున్న దాని మొహం గుర్తొచ్చేసరికి కన్నీళ్ళాగలేదు నాకు.

(ఏప్రిల్ 2001, ఆంధ్రభూమి సచిత్ర మాస పత్రిక)

